ఇండోర్ స్టేడియం డోర్ క్లోజ్

నిరుపయోగంగా ఇండోర్ స్టేడియం

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.2.49 కోట్లతో నిర్మాణం
- నేడు ఎవరూ పట్టించుకోని వైనం
- ప్రభుత్వ తీరుపై క్రీడాకారుల్లో తీవ్ర అసంతృప్తి



నిరుపయోగంగా మారిన ఇండోర్ స్టేడియం



బాస్కెట్ బాల్ కోర్ట్

మచిలీపట్నంఅర్బన్: నగరంలో అన్ని హంగులతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇండోర్‌స్టేడియం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.49 కోట్ల శాప్ నిధులతో ఇండోర్ స్టేడియం, రెండు బాస్కెట్ బాల్, రెండు టెన్నిస్ కోర్టులను నిర్మించి 2024 మార్చిలో ప్రారంభించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇండోర్ స్టేడియంకు తాళం వేసింది. క్రీడాకారుల నైపుణ్యాభివృద్ధి కోసం నిర్మించిన ఈ స్టేడియం నిరుపయోగంగా మారటంతో క్రీడాకారులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా పరిషత్ సెంటర్ సమీపంలో స్పోర్ట్ అథారిటీ కార్యాలయం ఉంది. అక్కడ స్విమ్మింగ్‌పూల్, జిమ్ సౌకర్యాలు మాత్రమే ఉన్నాయి. వీటికి ఇద్దరు కోచ్‌లు ఉన్నారు. దీనికి అనుబంధంగా ఇండోర్ స్టేడియం పనిచేయాలి.

నిరాశే మిగిలింది..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు కావస్తున్నా ఈ స్టేడియం వ్యవహారాన్ని గాలికొదిలేసింది. ఇండోర్ స్టేడియంలో షటిల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్, తదితర క్రీడలు నిర్వహించేందుకు అత్యాధునిక సదుపాయాలను కల్పించారు. పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, డ్రెస్సింగ్ రూమ్స్, విశ్రాంతి గదులు ఏర్పాటు చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయి ఇండోర్ క్రీడల పోటీలు ఇక్కడ నిర్వహించే వీలుంది. కోచ్‌లను, సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఈ స్టేడియం అందుబాటులోకి వస్తే నగరవాసుల్లో ఎంతో మంది క్రీడల్లో నైపుణ్యం సాధించి బందరు ఖ్యాతిని చాటేవారని పలువురు అంటున్నారు. ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వచ్చిందని సంబరపడిన క్రీడాకారులకు ప్రభుత్వ తీరు నిరాశే మిగిల్చింది.

ప్రస్తుత స్పోర్ట్స్ అథారిటీ సెంటర్‌లో..

జిల్లా పరిషత్ సెంటర్ సమీపంలో స్పోర్ట్ అథారిటీ కార్యాలయం ఉంది. అక్కడ స్విమ్మింగ్‌పూల్, జిమ్ సౌకర్యాలు మాత్రమే ఉన్నాయి. వీటికి ఇద్దరు కోచ్‌లు ఉన్నారు. దీనికి అనుబంధంగా ఇండోర్ స్టేడియం పనిచేయాలి. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోవటం లేదని క్రీడాభిమానులు విమర్శిస్తున్నారు.

వినియోగంలోకి తేవాలి..

నగరంలోని యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు కోట్ల నిధులను వెచ్చించి నిర్మించిన ఇండోర్ స్టేడియంను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. ఈ ప్రాంగణమంతా పశువులు సంచరిస్తూ దుర్గంధభరితంగా మారి డంపింగ్‌యార్డును తలపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడాకారులు కేరింతలతో సందడిగా ఉండాల్సిన ప్రాంగణం నిర్మానుష్యంగా మారిందని, తక్షణమే స్టేడియంను వినియోగించాలని క్రీడాకారులు,విద్యార్థులు,క్రీడాభిమానులు కోరుతున్నారు.



స్టేడియం చూసి సంతోషపడ్డా..కానీ..

ఇండోర్ స్టేడియం ప్రారంభమైందని చాలా సంతోష పడ్డాను. షటిల్ ఆడుకోవటానికి ఎప్పుడు వెళ్లినా తాళం వేసి ఉంటోంది. మంచి ప్రాక్టీస్ ఫెసిలిటీ లేకపోవడం వల్ల మా ప్రిపరేషన్‌లో అంతరాయం కలుగుతోంది. ఇండోర్ స్టేడియం ప్రవేశం ఉంటే, ప్రొఫెషనల్ లెవెల్‌లో ప్రాక్టీస్ చేయగలుగుతాను. – టి.మంజు, క్రీడాకారిణి



మంచి ప్లేయర్లను సిద్ధం చేయొచ్చు

ఇండోర్ స్టేడియం వల్ల టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ లాంటి ఇండోర్ గేమ్స్ అభివృద్ధి చెందుతాయి. ప్రారంభం ఆలస్యం వల్ల క్రీడాకారులకు అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇండోర్ స్టేడియం ఆయా అంశాలపై శిక్షణ ప్రారంభిస్తే మంచి ప్లేయర్లు బయటకు రావడానికి మార్గం ఏర్పడుతుంది. అధికారులు చర్య తీసుకుని స్టేడియాన్ని అందుబాటులోకి తేవాలి. – ఎస్.హరికృష్ణ, ప్రైవేట్ కోచ్



స్పోర్ట్స్ అథారిటీ దృష్టికి తీసుకువెళ్లాం..

ఇండోర్ స్టేడియం వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్పోర్ట్స్ అథారిటీని కోరాము. స్పోర్ట్స్ అథారిటీ వారి అనుమతులు వచ్చిన వెంటనే ఆమేరకు క్రీడాంశాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. క్రీడాకారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటాం. – ఝాన్సీలక్ష్మి, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి

రైస్ కార్డుదారులతో ఈకేవైసీ చేయించండి

ఘంటసాల: రైస్ కార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రేషన్ డీలర్ల సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్ డీటీ కొడాలి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లు తమ పరిధిలోని రైస్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరి చేత ఈకేవైసీ చేయించాలన్నారు. కార్డుదారులు కూడా డీలర్లు ఈకేవైసీ కొరకు వచ్చినప్పుడు సహకరించాలని, కార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఈ కార్యక్రమాన్ని నెలాఖరులోపు డీలర్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో 33 రేషన్ షాపులు ఉండగా సుమారు 13,500 రైస్ కార్డు దారులు ఉన్నట్లు పీడీఎస్ డీటీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కె.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ చైతన్య లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణంలో నైపుణ్యాభివృద్ధి కోర్సులు

చిలకలపూడి(మచిలీపట్నం): పామర్రు మండలం నిమ్మకూరులోని మహిళా ప్రాంగణంలో నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ప్రాంగణ జిల్లా మేనేజర్ డాక్టర్ ఎస్ జుబేదా పర్వీన్ బుధవారం తెలిపారు. 45 రోజుల పాటు టైలరింగ్, ఫ్యాబ్రిక్ కట్టర్, రెండు నెలల పాటు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులు శిక్షణ ఇస్తామన్నారు.టైలరింగ్, ఫ్యాబ్రి క్ కట్టర్‌కు సంబంధించి ఓసంవత్సరం విషయ పరిజ్ఞానం, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, చదవటం, రాయటం వచ్చిన మహిళలు అర్హులన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు పదో తరగతి ఆపై విద్యార్హతలు ఉండాలన్నారు. 18 నుంచి 40 సంవత్సరాలు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ సౌకర్యం ఉందని,ఆసక్తి ఉన్న వారు 89195 75259 నంబరును సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

పేరుకుపోతున్న చెత్త



పెడన: మండల పరిధిలోని బలిపర్రు గ్రామం నుంచి కాకర్లమూడి వెళ్లే రోడ్డులో చెత్త అధ్వానంగా పేరుకుపోతోంది. శుభ్రం చేసే వారు కరువయ్యారు. అటుగా ఇళ్లు లేకపోవడంతో మద్యం దుకాణం నుంచి వచ్చే చెత్త అంతా అటు పొలాల్లోకి చేరుతోంది. దీంతో పొలాల యజమానులు చెత్త సేకరణ లేదని దుమ్మెత్తి పోస్తున్నారు. ఇటు వైన్ షాపు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం ఈ రోడ్డులో ఏర్పాటు చేసి చెత్తను తీయించాలని రైతులు మొర పెట్టుకుంటున్నారు.

ఆకుకూరలతో వాణిజ్య ఉత్పత్తులపై శిక్షణ



కోసూరువారిపాలెం(మోపిదేవి): రోజువారీ ఆహారంలో వినియోగించే ఆకుకూరల ప్రాముఖ్యతను మహిళలు గుర్తించాలని గృహ విజ్ఞానశాస్త్రవేత్త జి.కృష్ణవేణి అన్నారు. మండలంలోని కోసూరువారిపాలెంలో ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో ఆకుకూరల్లో వాణిజ్య ఉత్పత్తుల తయారీపై మహిళలకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజువారీ ఆహారంలో ఆకుకూరల ప్రాధాన్య తను వివరిస్తూ వాటిలో లభించే పోషకాలు, ఆరోగ్య ప్రయోజనాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి వివరించారు. మునగాకు కారం పొడిని తయారు చేయించారు. ఆకుకూరలను ప్రాసెసింగ్ చేసి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీతో అధిక లాభాలు సాధించేందుకు అవసరమైన శిక్షణ పొందాలని మహిళలకు వివరిచారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి, పలువురు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యవర్గం



పెడన: ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీఎస్‌జీఈఎస్..384/2022) పెడన మున్సిపాలిటీ కమిటీ నియామకం బుధవారం జరిగిందని సంఘ జిల్లా అధ్యక్షుడు ఏ గోపీచంద్ తెలిపారు. స్థానికంగా జరిగిన పెడన కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశామన్నారు. కమిటీ అధ్యక్షుడిగా పామర్తి జితేంద్ర, ఉపాధ్యక్షుడిగా కె.పూర్ణచంద్రరావు, జనరల్ సెక్రెటరీగా చిన్నాపురపు విజయకుమార్, ట్రెజరర్‌గా ఫాజులున్నిసా బేగం, జాయింట్ సెక్రెటరీగా నాగాంజనేయులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా రామయ్య, జీవన జ్యోతి ఎన్నికయ్యారని తెలిపారు. ఈ కమిటీ పెడన మున్సిపాలిటీ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, వారి సంక్షేమం కొరకు పనిచేస్తుందన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొని తమ సమస్యల గురించి చర్చించారు.

కళాశాలలో రక్తదాన శిబిరం



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీ వాసవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల కరస్పాండెంట్ బాబా, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, రెడ్ క్రాస్ సెక్రెటరీ శంకర్ నాథ్ శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం వలన కలిగే ప్రయోజనాలు రక్తదాన ఆవశ్యకత తెలియపరిచారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది, డైరెక్టర్ బాబాతో సహా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్త దాతలను రెడ్ క్రాస్ సెక్రటరీ శంకర్‌నాథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్తగుండు రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పట్టాభి రెడ్ క్రాస్ బెడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ హనుమంతయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్, నాంచారయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



గూడూరు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు గూడూరు ఎస్సై కె.ఎన్.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో బాలికలు సందేశాత్మకమైన చిత్రాలు వేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగరంలో ఆక్రముల తొలగింపు ప్రక్రియ బుధవారం కూడా కొనసాగింది. రైతు బజార్ సెంటర్ నుంచి లక్ష్మీ టాకీస్ సెంటర్ వరకు రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలను తొలగించారు. అలాగే కల్వర్టులపై ఉన్న బడ్డీ కొట్లను తొలగించారు. పోలీస్ పహారా నడుమ జేసీబీ, క్రేన్ల సాయంతో ఆక్రమణలను తొలగించారు. డ్రెయిన్లపై వేసిన అక్రమ సిమెంటు స్లాబులను ధ్వంసం చేశారు. ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వీవీఎస్ బాపిరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరి ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్లలో ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తున్న ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఇలాంటి ఆక్రమణదారులు ముందస్తుగానే వారి ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. లేకుంటే తామే తొలగిస్తామని తెలిపారు. తొలగించిన ప్రాంతాల్లో మళ్లీ ఆక్రమణకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

క్రైస్తవుల తపస్సుకాల దీక్షలు ప్రారంభం

విశ్వాసులకు దీక్ష ఇచ్చిన విచారణ గురువు సురేష్



కోటగిరిలంక ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో దీక్షాధారులతో ఫాదర్ సురేష్

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని కోటగిరి లంక ఆర్‌సీఎం చర్చిలో తపస్సుకాల ఉపవాస దీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన 50 మందికి పైగా విశ్వాసులకు విచారణ గురువు సురేష్ మెళ్లో దీక్షలు ఇచ్చారు. అనంతరం విభూతి బుధవారంను పురస్కరించుకుని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ సురేష్ మాట్లాడుతూ దీక్ష తీసుకున్న 40 రోజుల ఉపవాసాల సమయంలో దీక్షాదారులు క్రీస్తు యెడల స్తుతి, కృతజ్ఞత, వినమ్రత, పశ్చాతాపం కలిగి ఉండాలని సూచించారు. ఈ సమయంలో తమకు తోచిన విధంగా పొరుగు వారికి సహాయ పడాలన్నారు. అనంతరం చర్చిలో దివ్యబలిపూజ చేసి విశ్వాసులకు దివ్యసత్ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపదేశిలు, సిస్టర్స్, విశ్వాసులు పాల్గొన్నారు.

చల్లపల్లి: విభూది బుధవారం సందర్భంగా మండల పరిధిలోని లక్ష్మీపురం శివారు సాలిపేట ఆర్‌సీఎం చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు, 40 రోజుల ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ బి.రమికుమార్ మాట్లాడుతూ ఉపవాస కాలంలో అనుసరించాల్సిన విధివిదానాలను వివరించారు. ప్రతి శుక్రవారం సాయంత్రం చర్చిలో పరిశుద్ధ శిలువ మార్గం, దివ్య సత్ప్రసాద ఆరాధన, బలిపూజ, వాక్య పరిచర్య వంటి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు వివరించారు. పలువురు ప్రార్థనా గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో దివిసీమలోని 12 గ్రామాలకు చెందిన విశ్వాసులు, ఉపదేశకులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి అష్టాదశ కలశాభిషేకం



అభిషేకాల అనంతరం భక్తులకు దర్శనం ఇస్తున్న అయ్యప్ప స్వామి

చల్లపల్లి: స్థానిక క్షేత్రంలో అయ్యప్ప స్వామికి అష్టాదశ కలశాభిషేకాలు, అన్నాభిషేకాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అష్టమ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాను నంబూద్రి ఆధ్వర్యంలో ఉదయం అయ్యప్పస్వామి ఆలయంలో గణపతి హోమం, కలశాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని అలంకరించి దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధనలో 3 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం నుంచి విష్ణుమూర్తికి విశేష అర్చన, పద్దెనిమిది మెట్లకు సంకల్ప పూర్వక నవవిధ కర్పూర హారతులు ఇచ్చారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అన్నవరపు పాండురంగారావు, కమిటీ సభ్యులు తుమ్మల వెంకటేశ్వరరావు, మార్గాని చంద్రశేఖరరావు తదితరులు పర్యవేక్షించారు.

మహిళా మణులకు అగ్రతాంబూలం



డాక్టర్ సాహితిని సన్మానిస్తున్న అధ్యాపకులు

కోనేరుసెంటర్: స్వాతంత్ర్యానంతరం మహిళలకు దేశం అన్ని రంగాల్లో పెద్దపీట వేసిందని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిత్యం మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. 50 ఏళ్ల కిందటే భారత దేశాన్ని ఉక్కు మహిళగా పేరుగాంచిన ఇందిరా గాంధీ సుదీర్ఘ కాలం పరిపాలించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దేశాన్ని సస్యశ్యామలం చేస్తున్న గంగా, యమునా, సరస్వతి, గోదావరి, కృష్ణా నదులను తల్లులుగా పూజించడం మన సంస్కృతికి నిదర్శనమన్నారు. ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ సాహితి స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటికి పరిష్కారాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం డాక్టర్ సాహితిని ఘనంగా సత్కరించారు. పలువురు ఆచార్యులు, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తయారీపై అవగాహన

రావివారిపాలెం(మోపిదేవి): మినుము పంటను అధికంగా నష్టపరిచే ఎలుకల నిర్మూలనకు యాజమాన్య పద్ధతులు అనుసరించాలని ఘంటసాల కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ బి.సుధారాణి తెలిపారు. బాపట్ల కళాశాల విద్యార్థులు, కేవీకే ఘంటసాల ఆధ్వర్యంలో ఎలుకల నిర్మూలన మందు తయారీపై మోపిదేవిలో బుధవారం అవగాహన కల్పించారు. మందు తయారు చేసే సమయంలో గ్లౌజులు, మాస్క్ విధిగా ధరించాలని రైతులకు సూచించారు. రావివారిపాలెంలో వేపనూనె ద్వారా పురుగు ఉత్పత్తులను నశింప చేయవచ్చని, వేప నూనె సేకరణ విధానాన్ని వివరించారు. ప్రోగ్రా కోఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి, ఎస్ఎంఎస్ డాక్టర్ రేవతి, అభ్యుదయ రైతులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరావు, కె.మాధవరావు, రావి సురేష్ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసిన రైతులకే మద్దతు ధర

ఘంటసాల: రబీ పంట కాలంలో ఈకేవైసీ చేయించుకున్న రైతులకే వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర వర్తిస్తుందని ఎంఏవో కె.మురళీ కృష్ణ బుధవారం తెలిపారు. కార్యాలయంలో ఏవో మాట్లాడుతూ రబీ 2024– 25 పంట కాలంలో మండలంలో 18,522 ఎరాలలో సాగు చేసిన పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. రైతులు వీఏఏను సంప్రదించి గురువారం సాయంత్రంలోపు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అపరాలు, మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఈకేవైసీ అయితేనే కనీస మద్దతు ధర పొందుతారన్నారు.

8 ఇసుక ట్రాక్టర్లు సీజ్

చల్లపల్లి: అనధికార ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 8 ట్రాక్టర్లను చల్లపల్లి పోలీసులు బుధవారం వెంటాడి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆముదార్లంక ఇసుక క్వారీ నుంచి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారని సమాచారం రావటంతో ఏఎస్ఐ ఉప్పాల వెంకటేశ్వరరావు, స్టేషన్ రైటర్ కె.రమేష్ క్వారిలోకి వెళ్లి ట్రాక్టర్లను పట్టుకునేందుకు ప్రయత్నించగా ట్రాక్టర్లతో సహా పారిపోయేం దుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అద్దంకి నాంచారమ్మకు ప్రత్యేక పూజలు



పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో వేంచేసియున్న అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం బాచు శ్రీనివాసరావు ఇంటి వద్ద జరిగిన పూజలో స్థానిక ఎస్ఐ సత్యనారాయణ దంపతులు పూజలు చేశారు. పెళ్లూరి శ్రీనివాస్ అర్చకత్వంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించగా, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, ఆకుల అజయ్‌కుమార్, పరుచూరి సాయి, యన్నం శ్రీనివాసరావు, బాచు వరప్రసాద్, బాచు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల మూసివేతపై మహిళల హర్షం

పెడన: మండలంలో రెండు మద్యం దుకాణాలు సీజ్ చేయడం చర్చనీయాంశమైంది. వాటాదారుల మధ్య మనస్పర్థలు అధికమై ఈ పరిస్థితి వచ్చిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని రెండు మద్యం దుకాణాలను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు ఉన్నతాధికారుల ఆదేశాలతో సీజ్ చేశారు. వాటి లైసెన్సులను సైతం రద్దు చేసినట్లుగా అధికారుల నుంచి సమాచారం. బలిపర్రు గ్రామంలోని కాకర్లమూడి రోడ్డులో దేవివైన్స్, చేవేంద్రపాలెంలోని ఆదిత్యవైన్స్ దుకాణాలను సీజ్ చేశారు. పరిసర ప్రాంతాల వారికి వాటికి తాళాలు ఎందుకు వేస్తున్నారో అర్థం కాక అయోమయానికి గురయ్యారు. అసలు వాటి లైసెన్సులనే రద్దు చేయడంతో తీస్తారా తీయరా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎందుకు సీజ్ చేశారంటే..

ఆయా దుకాణాలకు నుంచి బెల్టు దుకాణాలకు అధికంగా సరుకు సరఫరా అవుతుందనే సమాచారంతో పలు ప్రాంతాల్లో బెల్టు దుకాణాలలో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఈ రెండు షాపుల నుంచి అధికంగా సరుకు వెళ్లినట్లు గుర్తించారు. మొదటి సారి హెచ్చరించి వదిలేశారు. ఆ తరువాత జరిమాన కట్టించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. సరుకు బయటకు పోతుందని గుర్తించిన అధికారులు మంగళవారం సాయంత్రం ఆయా దుకాణాలను సీజ్ చేయడమే కాకుండా లైసెన్సులను రద్దు చేసినట్లు తెలియజేశారు.

హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు..

గాంధీ జయంతి, ఎన్నికలు ఇవేవి తేడా లేకుండా మంచినీటి కంటే మద్యం అధికంగా దొరుకుతుండటంపై మహిళలు గుర్రుగా ఉన్నారు. బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్న రెండు దుకాణాలను సీజ్ చేశారని తెలిసి పలువురు మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా చాలా దుకాణాలు బెల్టు దుకాణాలకు సరుకు సరఫరా చేస్తున్నారని, వాటిని కూడా పట్టుకోవాలని పలువురు మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఆ బెల్టు దుకాణాలకు సరుకు రవాణా చేసే మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంచాయతీల ఆదాయం పెంచాలి

బంటుమిల్లి: పంచాయతీల పరిధిలో వర్మికంపోస్టు యూనిట్ ద్వారా ఆదాయం పెంచుకునేందుకు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి కె.చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని ముంజులూరు గ్రామంలో సంపద సృష్టి కేంద్రం వద్ద బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పంచాయతీ సిబ్బందికి స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలు ఎవరి సాయంతో పనిలేకుండా స్వచ్ఛందంగా వర్మికంపోస్టు ద్వారా ఆదాయ వనరులు పెంచుకుని అభివృద్ధి చెందవచ్చని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీ శైలాజీ, డీఎల్‌పీవో కార్యాలయం ఏవో విశాలాక్షి అన్నపూర్ణ, కృత్తివెన్ను ఈవోఆర్డీ వెంకటేశ్వరరావు, కూనపురెడ్డి శ్రీను పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్‌గార్డులు తదితరులు పాల్గొన్నారు.